# తెల్లకార్డు

-మల్లాది రవిశంకర్

**వీధిలో నలుగురి ముందూ తల కొట్టేసినట్టయింది. వాకిట్లో అంత గలాటా జరుగుతుంటే... అదీ మా ఇంటి ముందర... పక్కింటి పంకజం, ఎదురింటి యమునా, వెనకింటి వనజ... గోడ మీద నుండి వినోదం చూసినట్లు చూసారు ఆసక్తిగా. ఇక రాబోయే కొంతకాలంపాటు వాళ్ల కబుర్లలో నలిగేది నేనే అని ఇంక చెప్పనక్కర్లేదు. వాళ్లు చెవులు కొరుక్కున్నా, గుసగుసలాడినా, నన్ను కలుపుకోకపోయినా మా గురించి మాట్లాడుకుంటున్నారేమో అన్న గిల్టీ ఫీలింగ్ నన్ను వెంటాడుతూనే వుంటుంది.**

**ఈ పరిస్థితి ఇంటి బయట అయితే... ఇక ఇంట్లో...? ఆయనకీ, చిన్నాడికీ ఎంతెంత గొడవలు అవబోతున్నాయో ఆలోచిస్తేనే భయంగా ఉంది.**

**జరిగిన సంఘటనకి ఆయన అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు.**

**“ఇంత బతుకూ బతికి ఇంటి వెనకాల చావాల్సి వస్తోంది. ఇదేనా వాడికి నువ్విచ్చిన శిక్షణ” అని కనిపిస్తేనే గయ్యిమంటున్నారు.రేపెలా అవుతుందని భయం వేస్తోంది. చిన్నాడు క్షేమంగా కాలేజీ నుంచి తొందరగా ఇంటికి రావాలని మనసు ఆరాట పడుతోంది. కాలు ఇంట్లో నిలువక మాటిమాటికీ బయటకు తొంగి చూస్తుంటే...**

పక్కింటి, ఎదురింటి, వెనకింటి వాళ్ల చూపుల్లో ఏదో ఏగతాళి ఉన్నట్లు అనుమానం.

గంట క్రితం... ఒక పదిమందిదాకా మోటుగా, రౌడీల్లాగా ఉన్న మనుషులు ఇంటి ముందుకొచ్చి “వినయ్ ఎవడ్రా ఇక్కడ?” అని అరిచారు.అదృష్టవశాత్తు లంచ్‌కి ఇంటికి వచ్చిన ఆయన ఇంట్లోనే ఉన్నారు. కంగారుగా ఇద్దరం బయటకెళ్లాం.

“వినయ్ ఎవరు? మీ అబ్బాయేనా?” అని అడిగారు. అవునన్నట్లు తల ఊపాం.

“వాడ్ని అదుపులో పెట్టుకోండి. మా ఊరి అమ్మాయి వెంట పడుతున్నాడు వాడు. అదేమిటని ప్రశ్నిస్తే పెళ్లి కూడా చేసుకుంటానని గీరగా సమాధానం చెబుతున్నాడు. వాడ్ని జాగ్రత్తగా ఒళ్లు దగ్గరుంచుకొమ్మని చెప్పండి. తరువాత జరగరానిది జరిగితే బాధపడి ప్రయోజనం లేదు. కన్నవాళ్లు కాబట్టి ముందు వార్నింగ్ ఇస్తున్నాం. వాడ్ని అదుపు చేస్తే, వాడికీ, మీకూ, మాకూ కూడా మంచిది” అని చెప్పేసి వచ్చినంత వేగంగా వెళ్లిపోయారు.

పూర్తిగా ఆ షాక్ నుండి తేరుకుని వాస్తవంలోకి వచ్చేలోపుగానే సందు దాటిపోయారు.

వాళ్ల మాటల సారాంశం మాత్రం బాగా అర్థమయింది.ఇద్దరు మగపిల్లలూ, ఉన్న ఒక్క ఆడపిల్లా.. ముగ్గురూ ఇంజనీర్లే అని చెప్పుకుంటుంటే నాకు బాగా గర్వంగా ఉంటుంది.

వాళ్ల ముగ్గురు చదువులో యావరేజ్ అయినా ఎలాగో కిందా మీదా పడి ఇంజనీరింగ్ సీట్ వచ్చేట్లు చేసారాయన.

పెద్దాడి చదువు ఈ సంవత్సరంతో పూర్తయింది. ఉద్యోగవేటలో ఉన్నాడు.

‘పోనీ మన ఫ్యాక్టరీకి వెళ్లరా’ అంటే వాడు మాట వినడు. వాడికి దూరపు కొండలు నునుపు. ఏ ఢిల్లీలోనో, బొంబాయిలోనో ఉద్యోగం సంపాదించాలని వాడి కోరిక. అందుకే ఆ దూరపుకొండల రుచిని కూడా చూడమని వాడి ప్రయత్నాలకి వాడ్ని వదిలేసాం.

ఇక రెండోవాడూ, అమ్మాయి ఫైనల్ ఇయర్‌లో ఉన్నారు. ఆ చదువేదో అయిపోగానే పిల్ల పెళ్లి చేయాలి.తగిన వరుడ్ని తేవడానికి ఎన్ని తిప్పలు పడాలో, ఎంత కట్నం పొయ్యాలో అని ఆయనా, నేనూ తెగ టెన్షన్ పడుతుంటే... ఈ చిన్నాడు ఈ కొత్త సమస్యను తెచ్చి పెట్టాడు.

చదువుకోండిరా అని కాలేజీకి పంపిస్తే ప్రేమలూ, దోమలూ...వింటానికే సిగ్గుచేటుగా ఉంది.వీళ్లని పైకి తీసుకువచ్చి ఫ్యాక్టరీని డెవలప్ చేసి కొంచెం అన్నిరకాలుగా నిలదొక్కుకోవడానికి ఆయన ఎంత కిందా మీదా పడుతున్నారో... ఈ వెధవలు అర్థం చేసుకోరు.

ఎంతవరకూ వాళ్లూ వాళ్ల అవసరాలూ..కోరికలు... అప్పటికీ నోట్లోంచి మాట రాకుండానే నోరు తెరిచి ఇది కావాలీ అని అడక్కుండానే వాళ్ల అవసరాలని అర్థం చేసుకుని ఎప్పటికప్పుడు తీరుస్తూనే ఉన్నాం. వాళ్ల కోసం ఇంత చేస్తున్నా తండ్రి కష్టాన్ని అర్థం చేసుకుని ఆయనకి చేయూతనిద్దామనే ఆరాటం ఒక్కరికి కూడా లేదు. వాకిట్లో బైక్ చప్పుడయింది. చిన్నాడు వచ్చినట్టున్నాడు. బైక్ స్టాండు వేసి పెద్దగా పాటలు పాడుకుంటూ బ్యాగ్ ఊపుకుంటూ సుడిగాలిలాగా ఇంట్లోకొచ్చాడు.

నా గుండె వేగంగా కొట్టుకోవడం మొదలుపెట్టింది. తండ్రీ కొడుకులు ఏం గొడవ పడతారో, ఈ గండం గడిచి గట్టెక్కాలని ముక్కోటి దేవతలకూ మొక్కుకున్నా. ఎవరూ నా మొర ఆలకించినట్లుగా లేరు.ఇంట్లో అడుగు పెట్టిన చెట్టంత పిల్లాడి చెంప పగలకొట్టారు ఆయన ఆవేశంగా.

ఏం జరిగిందో అర్థం కానట్టు తెల్లబోయి ఆయన వంకే చూస్తున్నాడు వాడు.

వాళ్ల చిన్నప్పుడు ఎప్పుడన్నా నేను ఒకటి అంటించానేమోగానీ ఆయన పిల్లలమీద ఏనాడూ చేయి చేసుకుని ఎరుగరు.ఎర్రబడ్డ చెంపని రాసుకుంటూ బ్లాంక్‌గా చూస్తూ ఉండిపోయాడు వాడు నాన్నకి అంత కోపం తనమీద ఎందుకొచ్చిందో అర్థం కానట్టుగా.

“కాలేజీకి చదువుకొమ్మని పంపిస్తే కులం తక్కువ వాళ్లతో ప్రేమలు కావాల్సి వచ్చాయిరా నీకు?” అన్నారు కఠినంగా.

“అరే...తెలిసిపోయినట్టుందే?” అన్నాడు చిన్నాడు అతి మామూలుగా. వాడి ముఖంలో

భయంగానీ, తప్పు చేసాననే గిల్టీ ఫీలింగ్‌గానీ లేదు.

"నీకంటే పెద్ద అన్ననీ, చిన్న చెల్లెన్నీ పెట్టుకుని బాధ్యత లేకుండా ఇలాంటి నీతిమాలిన పనులు చేయడానికి సిగ్గులేదూ" ఆయన బిపి పెరిగిపోతోంది.

"నీతిమాలిన పనులు... అంత పెద్ద మాటలు ఉపయోగించే అర్హత మీకెక్కడుంది నాన్నా?" అన్నాడు చిన్నాడు. తెల్లబోయి వాడి వంక చూడడం ఇప్పుడు మావంతయింది.


మా చిన్నాడు బుడి బుడి నడకల బుడతడిగా ఉన్నప్పుడు వాడి పాదాలని తన పాదాలమీద ఉంచుకుని నడిపించిన ఆయన గుర్తుకొచ్చారు.

వాడికి జ్వరం వస్తే రాత్రి రెండుగంటలదాకా నిద్రకు దూరమై వాడిని లాలిస్తూ, ఓదారుస్తూ, జుట్టులోకి చేయి పోనించి ఆర్తిగా చూస్తూ మధ్యమధ్యలో చల్లనీటితో తువ్వాలు ముంచి ఒళ్లంతా తుడుస్తూ, చలికీ జ్వర తీవ్రతకీ వాడు వణికిపోతుంటే వాడిని గుండెలకు హత్తుకుని 'రేపటికల్లా జ్వరం తగ్గిపోతుంది చిన్నా' అని వాడికి ధైర్యం చెప్పి, వాడు పడుకునేదాకా వాడికి చిచ్చికొట్టిన ఆయన గుర్తుకువచ్చారు.

పదో తరగతి కంపార్ట్‌మెంట్‌లో, ఇటర్ అత్తెసరు మార్కులతో పాసయినా వాళ్ల కాళ్లు, వీళ్ల కాళ్లు పట్టుకుని కిందా మీదా పడి వీళ్ల ఋగ్గురికీ ఇంజనీరింగ్ కాలేజీ చూసే అవకాశం కలిగించిన ఆయన గుర్తుకువచ్చారు.

అలాంటి తండ్రిని పట్టుకుని అంత మాట అన్నాడేమిటి ఏడు? ఇంత ఎదిగిపోయాడా? అని అవాక్కయ్యాను నేను. వాడు కంటిన్యూ చేస్తున్నాడు.

"నాన్నా! మీరంటే నాకు చాలా గౌరవం. ఒక తండ్రిగా నాకు ఇవ్వాల్సిన దానికంటే అంతా ఎక్కువే ఇచ్చారు.



కాం...నేను తినే ప్రతి మెతుకు వెనుకా వ్యవస్థని దోచుకునే ఒక అక్రమ వ్యవహారం ఉంటుంది. నేను వేసిన ప్రతి ముందడుగు వెనుకా మీరు తొక్కిన దొంగదారుల ఛాయలే కనిపిస్తాయి'' వాడు ఒక్క క్షణం ఆగాడు.

"సమాజాన్ని నేనేం దోచుకున్నాను?'' ఆవేశంగా అన్నారాయన.

'మీరే చెప్పాలి. నా నోటి నుండి వినాలని ఉంటే మరి వినండి'' అంటూ వాడు చెప్పడం మొదలుపెట్టాడు.

"నా పదేళ్ల వయస్సులో మనకో వర్క్‌షాపు ఉండేది. దాని నుండే వచ్చే ఆదాయంతో మనం సుఖంగానే ఉండేవాళ్లం. దాన్నేం చేసారు మీరు? రాత్రికి రాత్రి తగలబెట్టించారు. మన చేతితో కట్టుకున్న గూడు, కష్టపడి కట్టుకున్న గూడు మీద పెట్రోలు పోసి తగులబెడుతుంటే అర్థం కానట్టు చూస్తున్న నా భుజం తట్టారు. ఆ క్షణం మీ కళ్లల్లో బాధ కనిపించలేదు. ఏదో సంతోషం కనిపించింది. అప్పుడు అది అర్థం కాలేదు. తరువాత అర్థమయింది. ఇన్సూరెన్స్ సర్వేయర్ వచ్చినప్పుడు వాడి జేబులో నోట్లు పెట్టి అది యాక్సిడెంట్ అనీ, షార్ట్ సర్క్యూట్ అనీ అతని చేత రాయించి పెద్ద మొత్తంలో ఇన్సూరెన్స్ క్లెయిమ్ మేనేజ్ చేసారు మీరు.

ఆ వచ్చిన డబ్బుతో ఫ్యాక్టరీ మొదలుపెట్టారు. ఫ్యాక్టరీ బాగానే నడిచేది. అయినా రామెటీరియల్ ఇంపోర్ట్ చేసుకోవడానికి లైసెన్సులు సంపాదించి వాటిని ప్రొడక్షన్‌కి వాడకుండానే అమ్మేసేవారు. మెటీరియల్ వాడినట్లు దొంగలెక్కలు చూపించేవారు. ఫ్యాక్టరీ నడవడానికి వాడే కరెంట్‌లో కూడా డిపార్ట్‌మెంట్ ఉద్యోగులతో లాలూచీలు... అక్రమ పవర్ వాడకం....నేను మిమ్మల్ని తప్పు పట్టడంలేదు నాన్నా. నాకా అధికారం కూడా లేదు. ఎందుకంటే ఇంతకాలం మీరు చూపించిన దారిలోనే బ్రతుకుతూ వచ్చాను. కొద్దికాలం క్రితమే తెలిసింది... మా ముగ్గురికీ ఇంజనీరింగ్‌లో సీట్లు సంపాదించడానికి మనకోసం తెల్ల రేషన్‌కార్డు పుట్టించారని. తెల్ల రేషన్‌కార్డు పావర్టీ లైన్, దరిద్రరేఖకి కింద ఉన్నవాళ్లకి ప్రభుత్వం ఇచ్చే వెల్‌ఫేర్ మెజర్. బియ్యం, పప్పులు, ఉప్పులు చవక్కి ఇచ్చి జీవితం మీదా, బ్రతుకుమీదా, వ్యవస్థ మీదా నమ్మకం పోగొట్టుకుంటున్న వారికి ఒక ఆశాకిరణం. వాళ్లకీ ఉన్నత విద్యలు చదువుకునే అవకాశం, మెరుగైన వైద్యసేవలు అందుకునే అవకాశం కోసం ప్రభుత్వం చేస్తున్న ఒక చిన్న ప్రయత్నం.

దాంట్లో కూడా మీలాంటి వాళ్లు అడ్డుపడి అవకాశాలను లాగేసుకుంటున్నారు. మా ముగ్గురి ఇంజనీరింగ్ పెద్ద ఖర్చు కాకుండానే అయిపోయింది. క్రితం సంవత్సరం నాయనమ్మకి వైద్యం తెల్లకార్డుమీదనే చేయించారు.

రేపు నా ఇంజనీరింగ్ అయిపోయాక ఉద్యోగం రాగానే వరకట్నాల విపణిలో నాకూ ఒక కట్నం ట్యాగ్ కట్టి నుంచోబెడతారు. ఎంతకాలం నాన్నా ఇలా దోచుకుంటాం. అందుకే నేను డిసైడ్ అయిపోయాను. నా కాళ్లమీద నేను నిలబడతాను. ధర్మంగా, న్యాయంగా సంపాదించుకుంటాను. కేంపస్ సెలక్షన్స్‌లో నాకు జాబ్ వచ్చింది. కులం తక్కువ పిల్ల అంటున్నారే.. ఆమె నాలో కాంపిటీటివ్ స్పిరిట్‌నీ, సోషల్ రెస్పాన్సిబిలిటీని కలిగించింది. అందుకే యావరేజ్ స్టూడెంట్‌గా ఇంజనీరింగ్‌లో చేరిన నేను ఈ రోజు కాలేజీ టాపర్‌గా వచ్చాను.

ఇక పెళ్లి మాట అంటారా...? అది ఇప్పుడిప్పుడేకాదు. నాకు సమాజం ఇంతిచ్చింది ఇంతకాలం. ఆ ఋణాన్ని కొంతయినా తీర్చుకోవాలి. ఒక పదేళ్లపాటు నా జీతంలో మూడొంతులు పేద పిల్లల చదువుకోసం డొనేట్ చేయాలనుకుంటున్నాను. ఆమె కూడా పెళ్లికి తొందర పెట్టడంలేదు. మీరు ఇచ్చిన ఈ రిచ్ లైఫ్ నుండి నా తాహతుకుతగ్గ లైఫ్‌లోకి నడవాలనుకుంటున్నాను. త్వరలోనే ఒక చిన్న రూమ్ తీసుకుని వెళ్లిపోవాలనుకుంటున్నాను.

నాన్నా! దయచేసి నన్నర్థం చేసుకోండి. మిమ్మల్ని నేను విమర్శించడం లేదు. మీరూ, మీలాంటి పెద్దలూ పేదలకిస్తున్న చిన్న సహాయంలో కూడా భాగాలు కోరుతున్నారు. చివరికి శవపేటికల తయారీ, కొనుగోళ్లలో కూడా కమీషన్లు కొడుతున్నారట కొందరు పెద్ద మనుషులు. ఇది ఇలాగే సాగిపోతే... దేశం ప్రగతి పథంలో ఎప్పటికి పయనిస్తుంది? ఇలా తెల్లకార్డుని నల్లబజారులో కొంటుంటే ఎప్పటికి ప్రభుత్వం అందిస్తున్న చేయూత పేదప్రజలకి చేరుతుంది? అందుకే మీ తెల్లకార్డులో నా పేరు కొట్టేయడానికి అప్లికేషన్ ఇచ్చాను'' అన్నాడు చిన్నాడు.

కళ్లముందు కనిపించే ప్రతి చిన్నదీ చిన్నది కానే కాదనీ, వాటిని పరిశీలించి చూడాలనీ మా చిన్నాడు చెబుతున్నట్లుంది. వాడిని మేము మార్చాలా? వాడు మమ్మల్ని మారుస్తాడా? అర్థం కానట్టూ, వాడు మా తప్పుల్ని చూపిస్తూ కొట్టిన మొట్టికాయలకి కట్టిన బొప్పుల్ని తడుముకుంటూ ఉండిపోయాం నేనూ, మావారూ!

★

## హన్సిక మనోభావాలు

'దేశముదురు'తో ప్రేక్షకులని తన అందచందాలతో ఆకట్టుకున్న హన్సికను చూస్తే చాలా ఆశ్చర్యమేస్తుంది. అదేమిటో ఆమె మాటల్లోనే విందాం... 'నేను సెట్ బయట ఎంత మోడరన్‌గా వున్నా సెట్‌లోకి అడుగుపెట్టగానే దేవాలయంలోకి అడుగుపెట్టిన ఫీలింగ్ కలుగుతుంది. మనలోని నటనను రాబట్టే డైరెక్టర్ నాకు గురువుతో సమానం. మన ఉన్నతికి, పొందుతున్న గౌరవానికి కారణం సినిమా పరిశ్రమే' అంటోంది హన్సిక. చాలా ఆధునికంగా కనిపించే హన్సికలో ఇటువంటి సున్నితమైన భావాలు ఉండడం ప్రశంసించవలసిన విషయమే!

